యజమాని పేరు ఉంటేనే పన్ను చెల్లిస్తాం

ఎంహెచ్ నగర్ కాలనీవాసుల స్పష్టం

పోచమ్మమైదాన్, మార్చి 25: బిల్లుపై యజమాని పేరు ఉంటేనే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఇంటి పన్నులు చెల్లిస్తామని వరంగల్ 13వ డివిజన్ ఎంహెచ్ నగర్ కాలనీవాసులు స్పష్టం చేశారు. తమకు పట్టా ఇచ్చి, ఇంటి నంబర్ అలాట్ చేసినా పన్ను చెల్లించేటప్పుడు మాత్రం యజమాని పేరు ఎందుకు ఉండడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఎంహెచ్ నగర్‌లోని దాదాపు 720 మంది గుడిసెవాసులకు బీఆర్‌ఎస్ హయాం లో ఇంటి పట్టాలు ఇవ్వడంతో సొంత ఇళ్లు నిర్మించుకున్నారు. దీంతో వీరికి ఇంటి నంబర్ రావడంతోపాటు ఇతర సదుపాయాలు కల్పించారు. అయితే, ఇంటి పన్ను నోటీసులో యజమాని పేరు బదులు ది హోల్డర్ అని ఉండడంతో పన్ను చెల్లించేందుకు స్థానికులు నిరాకరిస్తున్నారు. దీంతో గత్యంతరం లేక అధికారులు వెనుదిరుగుతున్నారు.

యజమాని పేరుపై బిల్లు ఇవ్వాలి

మాకు పట్టా, ఇంటి నంబర్ కేటాయించినా టాక్స్ నోటీసులపై మా పేరు ఎందుకు ఉండడం లేదు. మా పేరుకు బదులు హోల్డర్ అని ఉండడంతో ఎవరి పేరున పన్ను కడుతున్నామో తెలియడం లేదు. ఇంటి యజమాని పేరు ఉంటేనే పన్ను చెల్లిస్తాం. పేరు లేకుంటే టాక్స్ చెల్లించే ప్రసక్తే లేదు.

– కంచె రాజు

నర్సంపేటలో ప్రభుత్వ భూమిని కాపాడాలి

- అక్రమార్కులకు అండగా నిలుస్తున్న కాంగ్రెస్ నేతలు
- కలెక్టర్‌కు విన్నవించిన దళిత సంఘాల నేతలు

నర్సంపేట, మార్చి 25: నర్సంపేట పట్టణంలో మహబూబాబాద్ రోడ్డును ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని కాంగ్రెస్ పార్టీ నాయకుల అండదండలతో కొంతమంది ఆక్రమించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని, వారి నుంచి భూమికి కాపాడాలని భూ పోరాట కమిటీ అధ్యక్షుడు మంద ప్రకాశ్ కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లాకేంద్రంలో కలెక్టర్ సత్యశారదను దళిత సంఘాల నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 121లోని ప్రభుత్వ భూమిలో ఓ ప్రభుత్వ ఉద్యోగి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బానోత్ లక్ష్మణ్‌నాయక్ అండతో అక్రమంగా ఇంటి నిర్మాణం చేపట్టాడన్నారు. 2010 నుంచి 2016 వరకు రాంనగర్ కాలనీకి చెందిన దళితులు 4.06 ఎకరాల ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని నివసించగా, అప్పటి రెవెన్యూ అధికారులు 22 మందిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించారని గుర్తుచేశారు. అప్పట్లో జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో సర్వే చేసి ప్రభుత్వ భూమిగా నిర్ధారించారని వివరించారు. కొంతమంది ఆ భూమిని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని వినతిపత్రంలో పేర్కొనారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నాయకులు మాదాసి సదానందం, మంద ప్రభాకర్, వీ రాజు, వరమ్మ, గొర్రె శాంతిబాబు, బోడ సంజీవ, బిర్రు రాజు, సరిత, భాస్కర్, మాదాసి కృష్ణ, కట్టస్వామి, సుధాకర్, భాస్కర్, ప్రసాద్, స్వామి, రవితేజ, యశోద, ఇందిర, రమేశ్, కమల, ఇసాక్ ఉన్నారు.

నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

కరీమాబాద్: సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సత్య శారద అన్నారు. వరంగల్‌లో నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ పనులను ఆమె అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. వచ్చే సెప్టెంబర్ నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, రోడ్లు, భవనాల అధికారి రమేశ్, డీఈ శ్రీధర్, కలెక్టరేట్ ఏవో విశ్వప్రసాద్, ఏఈ శ్రీకాంత్, తహసీల్దార్ ఇక్బాల్, ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వరంగల్ బస్టాండ్ పనుల్లో నిర్లక్ష్యం

- రాయి ఎగిరొచ్చి ఆర్టీసీ డ్రైవర్‌కు గాయాలు
- బండలు పేల్చివేస్తుండగా ఘటన
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు, ప్రయాణికులు



అద్దం పగిలి బస్సులో పడిన రాయి

కరీమాబాద్, మార్చి 25 : వరంగల్‌లో నిర్మిస్తున్న నూతన బస్టాండ్ పనుల్లో కాంట్రాక్టర్, వర్కర్ల నిర్లక్ష్యం కారణంగా మంగళవారం అపశృతి చోటుచేసుకుంది. ప్రజలను అప్రమత్తం చేయకుండానే పెద్ద బండను పేలుడు పదార్థాలతో పేల్చివేయగా ఓ రాయి ఎగిరొచ్చి ఆర్టీసీ బస్సుకు తగలగా అద్దం పగిలి డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. అయితే రాయి నేరుగా డ్రైవర్ తలకు తగిలితే ప్రాణాపాయం తప్పేది కాదని అక్కడున్న వారు అంటున్నారు. వివరాల్లోకి వెళితే.. వరంగల్‌లో నూతన బస్టాండ్ పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం ఓ బండరాయిని పేలుడు పదార్థాలతో పేల్చివేశారు. ఇందులో నుంచి ఓ మోస్తరు రాయి వేగంగా ఎగిరొచ్చి ఆర్టీసీ బస్సు అద్దాన్ని పగులగొట్టుకుంటూ డ్రైవర్‌కు తగలడంతో అతడికి స్వల్ప గాయమైంది. ఈ ఘటనతో అక్కడున్న వారు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. మిట్ట మధ్యాహ్నం, ఎలాంటి నిబంధనలు పాటించకుండా, ముందస్తు చర్యలు తీసుకోకుండా పేల్చివేతలు చేపట్టడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పక్కనే ఉన్న తాత్కాలిక బస్టాండ్‌లో వేచి ఉన్న వందలాది మంది ప్రయాణికులను అప్రమత్తం చేయకుండా ఇష్టానుసారంగా పేల్చివేతలకు పాల్పడడంపై మండిపడుతున్నారు. ఇకముందు ఇలాంటివి జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

వరంగల్, మార్చి 25: పన్ను బకాయిదారులు సకాలంలో చెల్లింలి నగర అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. మంగళవారం రాత్రి ఆమె పన్నుల వసూళ్ల తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హనుమకొండ, హంటర్‌రోడ్, వరంగల్ చౌరస్తా ప్రాంతాల్లో పర్యటించి సూచనలు చేశారు. పన్నులు చెల్లించని స్టేషన్‌రోడ్డులోని నిత్య ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నుంచి రెండు గ్యాస్ సిలిండర్లు, టీ స్టాండ్‌ను అధికారులు జప్తు చేశారు. సుమారు రూ. 3 లక్షల ఆస్తి పన్ను బకాయి ఉంది.

కేంద్ర ఔషధ గిడ్డంగిని తనిఖీ

కరీమాబాద్, మార్చి 25: ఉర్సులోని కేంద్ర ఔషధ గిడ్డంగి (సెంట్రల్ డ్రగ్ వేర్ హౌస్)ను కలెక్టర్ సత్యశారద మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఔషధాల స్టాక్ రిజిస్టర్లు, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అనధికారికంగా విధులకు గైర్హాజరైన సూపర్‌వైజర్ నాగమణి, విధులు సక్రమంగా నిర్వర్తించని ప్యాకర్ చక్రపాణికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టీజీఎంఐడీసీను కలెక్టర్ ఫోన్‌లో ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్, యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వాగ్దేవిలో ఈ-సమ్మిట్ 6.వో

ఖిలావరంగల్, మార్చి 25: విశ్వంభర ఎడ్యుకేషనల్ సొసైటీ వాగ్దేవి బొల్లికుంట క్యాంపస్‌లో బుధవారం ఈ–సమ్మిట్ 6.ఓ నిర్వహించనున్నట్లు కళాశాలల వ్యవస్థాపక అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పీ సత్యపాల్‌రెడ్డి సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రాంతీయ వృద్ధిని ప్రోత్సహించడం, ప్రతిభకు మద్దతు ఇవ్వడం ఈ–సమ్మిట్ ముఖ్య లక్ష్యమని తెలిపారు.

జువైనల్ హోంలో వైద్య శిబిరం

పోచమ్మమైదాన్, మార్చి 25: వరంగల్ ఆటోనగర్‌లోని బాలుర పరిశీలక గృహం (జువైనల్ హోం)లో అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ (పీపీ యూనిట్) వరంగల్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.యశస్విని విద్యార్థులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పౌష్టికాహారం తీసుకుంటూ, వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శ్రీదేవి, నర్మద పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE
★వరంగల్ హైవే రఘునాథ్‌పల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.
NT-329891

TOURS & TRAVELS
★16/04/25 అయోధ్య, కాశీ, నేపాల్, ముక్తినాథ్ యాత్ర & 09/05/25 సరస్వతీ పుష్కరాలు, చార్‌ధామ్ యాత్ర. రై+బ+భో+వ. భాగ్యలక్ష్మి టూర్స్. Ph: 9397617094.
NT-1899

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

మార్కెట్ భవనానికి మోక్షమెప్పుడో?

రూ. 2 కోట్లు మంజూరు చేసిన గత ప్రభుత్వం
ఎన్నికలు రావడంతో మధ్యలోనే ఆగిన పనులు
కాంగ్రెస్ పాలనలో ముందుకు సాగని నిర్మాణం
ప్రజలు, చిరువ్యాపారుల ఎదురుచూపు

మధ్యలోనే ఆగిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన నిర్మాణ పనులు

వర్ధన్నపేట, మార్చి 25: వినియోగదారులు, చిరువ్యాపారుల కోసం గత బీఆర్‌ఎస్ సర్కార్ ప్రారంభించిన ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. నాలుగేళ్ల క్రితం పట్టణంలోని అంబేద్కర్ ప్రధాన కూడలి వద్ద ఉన్న ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని కూల్చి, ఆ స్థలంలో ప్రజా అవసరాలకు అనుగుణంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనాన్ని నిర్మించేందుకు కేసీఆర్ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందుకు అవసరమైన రూ. 2 కోట్ల నిధులు కూడా మంజూరు చేసింది. దీంతో అధికారులు భవన నిర్మాణ పనులను ప్రారంభించి పిల్లర్లు, బీమ్‌లు కూడా నిర్మించారు.

అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. భవన నిర్మాణం పూర్తయితే పట్టణానికి చెందిన కూరగాయల వ్యాపారులతోపాటు మాసం, చేపలు, ఇతర ఆహార ఉత్పత్తులను కూడా ఒకే కేంద్రంగా విక్రయించుకునే అవకాశం ఉంటుంది. కానీ, ప్రస్తుతం ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు, వ్యాపారులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

చిరువ్యాపారులకు చేయూత

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన నిర్మాణం పూర్తయితే మండలకేంద్రంతోపాటు చుట్టుపక్కల గ్రామాల రైతులు, చిరువ్యాపారులకు సహకారం అందేది. చుట్టుపక్కల గ్రామాల రైతులు కూరగాయలు, ఆకు కూరలు పండించే రైతులు నేరుగా మార్కెట్‌కు తీసుకొచ్చి వినియోగదారులకు విక్రయించుకునే వెసులుబాటు ఉంటుంది. అంతేకాకుండా చిరువ్యాపారులు కూడా భవనంలో షెడ్‌ను అద్దెకు తీసుకొని కూరగాయలు, చేపలు, మాంసాన్ని విక్రయించుకునే అవకాశం లేకపోలేదు. అంతేకాకుండా ప్రజలకు కూడా ఒకేచోట అన్నిరకాల వస్తువులు లభ్యమవుతాయి. దీనివల్ల మున్సిపాలిటీకి కూడా ఆదాయం పెరుగుతుంది. పట్టణం కూడా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

పట్టింపులేని పాలకులు

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన నిర్మాణ పనులను పూర్తి చేయడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చిరువ్యాపారులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తునారు. ప్రజాధనంతో నిర్మించిన భవన నిర్మాణాన్ని కనీసం అధికారులు పరిశీలించిన దాఖలాలు లేవు. ఇప్పటికే 40 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు పూర్తి చేస్తే మార్కెట్ భవనం అందుబాటులోకి వస్తుంది. ఈ భవనాన్ని పూర్తి చేస్తే పట్టణం మరింత ప్రగతి సాధిస్తుందని స్థానికులు చెబుతున్నారు. వెంటనే పాలకులు స్పందించి నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని పట్టణ ప్రజలు, రైతులు, చిరువ్యాపారులు కోరుతున్నారు.

పెళ్లయిన నెలకే యువకుడి ఆత్మహత్య

నెక్కొండ, మార్చి 25: ప్రేమించి పెళ్లి చేసుకున్న ఓ యువకుడు కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పిట్టకాయలబోడు తండాలో జరిగింది. నెక్కొండ ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. తండాకు చెందిన ధరావత్ గణేశ్ అలియాస్ సిద్దూ(22) నెల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ పెళ్లి ఇరు కుటుంబాలకు ఇష్టం లేకపోవడంతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మనోవేదనకు గురైన గణేశ్ ఈ నెల 20న పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని నర్సంపేటలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఐదు రోజులపాటు చికిత్స పొందిన గణేశ్ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తల్లి ధరావత్ విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఈఎంఐలు కట్టలేక ఆర్‌ఎంపీ మృతి

గీసుగొండ, మార్చి 25: ఈఎంఐలు కట్టలేక గ్రామీణ వైద్యుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మనుగొండలో మంగళవారం జరిగింది. సీఐ మహేందర్ కథనం ప్రకారం.. చాగంటి సారంగపాణి(42) గ్రామంలో ప్రాథమిక చికిత్సాలయం నిర్వహిస్తున్నాడు. అతడు ఇంటి అవసరాల కోసం బ్యాంకుల్లో హౌసింగ్ లోన్, టూవీలర్ లోన్, మహిళా సంఘాల్లో రుణాలు తీసుకున్నాడు. ప్రతినెలా ఈఎంఐల కోసం రూ. 25 వేలు చెల్లించాల్సి ఉంది. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో అతడు ఈఎంఐలు కట్టలేకపోతున్నాడు. ఈ క్రమంలో బ్యాంకు, మహిళా సంఘాల నుంచి ఒత్తిడి పెరగడంతో మనస్తాపం చెందిన అతడు సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పీఎంపీపై యువకుల దాడి

కాశీబుగ్గ, మార్చి 25: ప్రైవేట్ వైద్యుడిపై మద్యం మత్తులో యువకులు దాడి చేసిన ఘటన సిద్దయ్య హోటల్ ప్రాంతంలో ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికుల కథనం ప్రకారం.. కాశీబుగ్గకు చెందిన పీఎంపీ తొర్ని యుగేంధర్ వనం బాలకృష్ణ కుమారుడు సునీల్‌కు డబ్బులు బాకీ ఉన్నాడు. కొన్ని రోజులుగా అడుగుతున్నా ఆర్థిక పరిస్థితుల కారణంగా యుగేంధర్ దాటవేస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలో బాధితుడు ఇంతేజార్‌గంజ్ పోలీసులను శుక్రవారం ఆశ్రయించాడు. దీంతో యుగేంధర్‌కు ఇద్దరు ఎస్సైలతోపాటు ట్రైనింగ్ ఎస్సై ఫోన్ చేసి స్టేషన్‌కు రావాల్సిందిగా సూచించగా అతడు వెళ్లలేదు. దీన్ని మనస్సులో పెట్టుకొని ఆదివారం సాయంత్రం వనం సునీల్‌తోపాటు మరో ముగ్గురు మద్యం తాగి యుగేంధర్‌పై దాడి చేశారు. అతడి సెల్‌ఫోన్, బైక్‌ను తీసుకెళ్లారు. గాయాలతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. అతడిని పోలీసులు ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. మంగళవారం సాయంత్రం ఇంతేజార్‌గంజ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేటారు.

బావమరిదిపై బావ దాడి

సంగెం, మార్చి 25: తన భార్యను కాపురానికి పంపించడం లేదనే కోపంతో ముగ్గురు వ్యక్తులతో కలిసి బావమరిదిపై బావ దాడి చేసిన ఘటన మండలంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని నార్లవాయి గ్రామానికి చెందిన దామెర కిశోర్ చిన్న చెల్లి ప్రభ ఎల్లూగ్‌రంగంపేటకు చెందిన ఇమ్మడి అఖిల్‌ను గతేడాది ప్రేమ వివాహం చేసుకుంది. వారు కొన్ని రోజులు బాగానే ఉన్నారు. గత నెలలో భార్యాభర్తల మధ్య గొడవలు రావడంతో ప్రభ పుట్టింటికి వచ్చింది. తన భార్యను కాపురానికి పంపడం లేదనే కోపంతో అఖిల్ మంగళవారం మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి కిశోర్‌పై దాడి చేశారు. బాధితుడికి తీవ్ర రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో ఎంజీఎం దవాఖానకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్.నరేశ్ తెలిపారు.

కరీమాబాద్‌లో చోరీ

కరీమాబాద్, మార్చి 25: కరీమాబాద్ శివాలయం సమీపంలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. బాధితుడు శ్యామ్ తన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లి మంగళవారం తిరిగి వచ్చాడు. ఈ క్రమంలో ఇంట్లో సామగ్రి చిందరవందరగా పడి ఉన్నాయి. దొంగతనం జరిగినట్లు గమనించి వెంటనే 100కు ఫోన్ చేశాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ఇంట్లో 3.6 గ్రాముల బంగారం, 150 గ్రాముల వెండి, రూ. 80 వేల నగదు చోరీకి గురైనట్లు తెలిసింది.

నిర్వాసితులకు పరిహారం చెల్లిస్తాం: కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

ఖిలావరంగల్, మార్చి 25: ఇన్నర్ రింగ్‌రోడ్డులో భూములు కోల్పోయిన వారికి డబ్బులు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ సత్య శారద అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం మామునూరు ఎయిర్‌పోర్టు, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, గ్రీన్‌ఫీల్డ్, ఇన్నర్ రింగ్ రోడ్డుకు సంబంధించిన పనులపై అధికారుతో సమీక్షించారు. ఎయిర్‌పోర్టు నిర్మాణ పనుల్లో భాగంగా నక్కలపల్లి, గాడిపల్లిలో సర్వే పూర్తయినట్లు చెప్పారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో గ్రీన్ కవరేజీ ఏర్పాటు చేయాలని, వారంలోగా 15 వేల మొక్కలు నాటి జియో ట్యాగింగ్ చేయాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహించి గీసుగొండ, సంగెం, వరంగల్ మండలాల్లో 18 నుంచి 39 ఏళ్లలోపు నిరుద్యోగులను గుర్తించాలన్నారు. అలాగే, కుట్టుశిక్షణ కేంద్రాల్లో శిక్షణ ఇప్పించి నైపుణ్యం కలిగిన వారిని ఎంపిక చేయాలన్నారు. నేషనల్ హైవే పనుల్లో గీసుకొండ, సంగెం, చింతనెక్కొండలో భూ సేకరణ పనులకు అవార్డు పాస్ చేసేందుకు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సమీక్షలో వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, తహసీల్దార్లు బండి నాగేశ్వరరావు, ఎండీ ఇక్బాల్, రాజ్‌కుమార్, రియాజుద్దీన్, వెంకట్‌స్వామి, ఆర్‌అండ్‌బీ ఈఈ జితేందర్ రెడ్డి, ఇరిగేషన్ ఈఈ రామకృష్ణ పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

డీఎంహెచ్‌వో డాక్టర్ బి.సాంబశివరావు



తనిఖీలు చేస్తున్న డాక్టర్ సాంబశివరావు

నర్సంపేట, మార్చి 25: ప్రైవేటు దవాఖానల్లో ఎవరైనా గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.సాంబశివరావు హెచ్చరించారు. నర్సంపేట పట్టణంలోని మమత నర్సింగ్‌హోం, మల్లికా నర్సింగ్ హోం, కరుణశ్రీ హాస్పిటల్‌లో మంగళవారం లింగ నిర్ధారణ కేంద్రాలను డీఎంహెచ్‌వో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులకు ఆయన పలు సూచనలు చేశారు. ప్రతి ప్రైవేటు క్లినిక్, దవాఖానలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకొని విధిగా రికార్డులు నిర్వహించాలన్నారు. లింగ నిర్ధారణ కేంద్రాల్లో పరీక్షలు చేసే గైనకాలజిస్టులు, రేడియాలజిస్టులు గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానల్లో అవసరం మేరకే శస్త్రచికిత్సలు చేయాలని, సాధారణ ప్రసవాలు ఎక్కువగా జరిగేలా ప్రోత్సహించాలని సూచించారు. వేసవిలో నీళ్ల విరోచనాలు, బంక విరోచనాలు, చర్మ వ్యాధులు, వడదెబ్బ వచ్చే అవకాశాలు ఉన్నాయని, వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో మాతాశిశు సంరక్షణ అధికారి డాక్టర్ అర్చన, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, నాగరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఖానాపురం/గీసుగొండ: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో సాంబశివరావు అన్నారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి సంబంధించిన రికార్డులు, సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో సమీక్షించారు. ఆరోగ్య మహిళా క్లినిక్ ద్వారా అందించే సేవలపై సూచనలు చేశారు. ప్రభుత్వ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. వేసవిలో వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి ఒక్కరూ సక్రమంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణ్‌కుమార్, అర్చన, అనిల్‌కుమార్, నాగరాజు, కల్పన, రాజయ్య పాల్గొన్నారు. అలాగే, గీసుగొండ పీహెచ్‌సీని డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీందర్ సందర్శించారు. వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట సీహెచ్‌వో మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

కొమ్మాల జాతర ఆదాయం రూ. 49.11 లక్షలు

గీసుగొండ, మార్చి 25: కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతర ఆదాయాన్ని మంగళవారం లెక్కించినట్లు ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని దేవాదాయ శాఖ హాల్‌లో శ్రీవేంకటేశ్వరస్వామి సేవా సమితి సభ్యులు హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని లెక్కించినట్లు వారు తెలిపారు. హుండీల ద్వారా రూ. 20,11,096, దర్శన టోకెన్ల ద్వారా రూ. 14,86,481, కొబ్బరి ముక్కల వేలం ద్వారా రూ. 1.30 లక్షలు, కొబ్బరికాయల అమ్మకానికి వేలం ద్వారా రూ. 5.70 లక్షలు, లడ్డూ, పులిహోర ద్వారా రూ. 65,100, పుట్ట వెంట్రుకల వేలం ద్వారా రూ. 25 వేలు వచ్చినట్లు చెప్పారు. ఈ ఏడాది జాతర ఆదాయం రూ. 49,11,096 సమకూరినట్లు వెల్లడించారు. హుండీలో రెండు విదేశీ డాలర్లు, వెండి, బంగారం ప్రతిమలు రాగా, తిరిగి హుండీలో వేసినట్లు వివరించారు.

'ప్రభుత్వ హామీలు నెరవేర్చాలి'

నర్సంపేట, మార్చి 25: రేషన్ డీలర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పంజాల వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డీలర్లకు ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇస్తామన్న గౌరవ వేతనం రూ. 5 వేలను వెంటనే అందించాలని కోరారు. క్వింటాల్‌కు రూ. 300 కమీషన్ ఇస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. గడిచిన 18 నెలల కాంగ్రెస్ పాలనలో రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు కాకపోవడం బాధాకరమన్నారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

కరీమాబాద్, మార్చి 25: చార్‌బౌళి ప్రాంతంలో అక్రమంగా అమ్ముతున్న పొగాకు ఉత్పత్తులను మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి దాదాపు రూ. 38,620 విలువైన పొగాకు ఉత్పత్తులు, గుట్కాలను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ కోసం అతడిని ఇంతెజార్‌గంజ్ పోలీసులకు అప్పగించారు.

కాసులు కురిపిస్తున్న ఎల్ఆర్ఎస్

- ఇప్పటికే రూ. 35 కోట్ల ఫీజు వసూలు
- 31లోగా మరో రూ. 50 కోట్లు అంచనా

వరంగల్, మార్చి 25: ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) బల్దియాకు కాసులు కురిపిస్తున్నది. వారం రోజులుగా జీడబ్ల్యూఎంసీ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ జాతర కనిపిస్తున్నది. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులో జరిగిన తప్పులను సరిదిద్దే అవకాశం కల్పించడంతో అనేక మంది దరఖాస్తుదారులు ఫీజు చెల్లించేందుకు ముందుకొస్తున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం 1,00,992 దరఖాస్తులు వచ్చాయి. అందులో 8,169 ల్యాండ్స్ ప్రొహిబిటెడ్ కావడంతో ఆయా దరఖాస్తులను తిరస్కరించారు. మరో వెయ్యి దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. ఫీజ్ ఇంటిమేషన్ లెటర్లు సుమారు 50 వేల మందికి పంపించారు. అందుకు ఇంకా అనేక మందికి ఫీజు ఇంటిమేషన్ లెటర్ వెళ్లాల్సి ఉంది. అయితే, ఫీజు చెల్లించాలనుకునే వారు డాక్యుమెంట్, వెయ్యి చెల్లించిన ఎల్‌ఆర్‌ఎస్ రసీదు తీసుకొస్తే చెల్లించాల్సిన ఫీజు, రాయితీ ఎంతో సిబ్బంది చెబుతున్నారు. చెల్లించాలనుకునే వారితో ఫీజు కట్టిస్తున్నారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ఫీజు తీసుకుంటున్నారు.

ఫీజు చెల్లించేందుకు ఆసక్తి

ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా బల్దియాకు పెద్ద ఎత్తున ఆదాయం సమకూరుతున్నది. ఇప్పటి వరకు సుమారు రూ. 35 కోట్లకు పైగా ఫీజు వచ్చింది. మూడు వేలకు పైగా దరఖాస్తుదారులు ఫీజు చెల్లించారు. సుమారు 35 వేలకు పైగా దరఖాస్తులు ఫీజు చెల్లించేందుకు అప్రూవల్ అయ్యాయి. రోజురోజుకు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించే వారి సంఖ్య పెరుగుతున్నది. ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించే వెసులుబాటు ఉండడంతో దరఖాస్తుదారులు ఇంటి నుంచే ఎల్‌ఆర్‌ఎస్ సైట్ ద్వారా ఫీజు చెల్లిస్తున్నారు. ఫీజు చెల్లించే విధానాన్ని సులభతరం చేయడంతో చాలా మంది నగరవాసులు వినియోగించుకుంటున్నారు.

ఆదాయం మరింత పెరిగే అవకాశం

ఎల్‌ఆర్‌ఎస్‌పై ప్రకటించిన 25 శాతం రాయితీ చివరి గడువు 31 నాటికి మరో రూ. 50 కోట్లు వస్తాయన్న అంచనాలతో బల్దియా అధికారులు ఉన్నారు. మూడు వేలకు పైగా దరఖాస్తుదారులు చెల్లించిన ఫీజు ద్వారా సుమారు రూ. 35 కోట్ల ఆదాయం వస్తే.. గడువు చివరి నాటికి మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రతి రోజు బల్దియా ప్రధాన కార్యాలయంలో ఫీజు చెల్లిస్తామని వచ్చే వారు వందల్లో ఉంటున్నారు. దీంతో మార్చి 31 నాటికి బల్దియాకు మరో రూ. 50 కోట్లు వస్తాయన్న అంచనాలతో అధికారులు ఉన్నారు.

డైరీని ఆవిష్కరిస్తున్న డీఈవో జ్ఞానేశ్వర్

పీఆర్టీయూ డైరీ ఆవిష్కరణ

గిర్మాజీపేట, మార్చి 25: తెలంగాణ పీఆర్టీయూ–2025 డైరీని మంగళవారం డీఈవో జ్ఞానేశ్వర్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కొండ్రెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్కర్సు ఈశ్వర్, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలు ప్రతిభ, రాయపర్తి మండల అధ్యక్షుడు నవీన్, పర్వతగిరి మండల అధ్యక్షుడు సీహెచ్ రాజు, వరంగల్ జిల్లా మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు సంగీత పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఉన్న వీవోఏలు

రాయపర్తిలో వీవోఏల ముందస్తు అరెస్ట్

రాయపర్తి, మార్చి 25: మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరా క్రాంతి పథంలో విధులు నిర్వర్తిస్తున్న వీవోఏలను మంగళవారం వేకువజామునే పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాష్ట్రవ్యాప్తంగా వీవోఏల సమస్యల పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ సారథ్యంలో చలో అసెంబ్లీకి పిలుపునిచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు వీవోఏలను అదుపులోకి స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై వదిలిపెట్టినట్లు వీవోఏల మండల అధ్యక్షుడు పెదగాని వెంకటేశ్వర్లు తెలిపారు. అరెస్టయిన వారిలో వీవోఏలు బొమ్మెర రమాదేవి, కరుణశ్రీ, స్వప్న వీణా, సరికొండ నవల, పుష్ప, బొమ్మెర అలివేలుమంగమ్మ, మహ్మద్ హసీనా, యాకయ్య పాల్గొన్నారు.

కేటీఆర్ సేన 14వ డివిజన్ ఇన్‌చార్జిగా అజయ్



నియామకపత్రం అందుకుంటున్న అజయ్

కాశీబుగ్గ, మార్చి 25: కేటీఆర్ సేన 14వ డివిజన్ ఇన్‌చార్జిగా ఎనుమాముల ప్రాంతానికి చెందిన సౌరం అజయ్‌ని నియమించాలని రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు మైనాల నరేశ్, వర్ధన్నపేట నియోజకవర్గ అధ్యక్షుడు చిర్ర సుమన్‌గౌడ్ మంగళవారం అజయ్‌కి నియామక పత్రం అందజేశారు. బీఆర్‌ఎస్‌ను బూత్ స్థాయి నుంచి బలోపేతం చేస్తానని అజయ్ అన్నారు.

'ఉద్యమకారుల హామీలు అమలు చేయాలి'

చెన్నారావుపేట, మార్చి 25: గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు, ఉద్యమకారుడు మూడు రమేశ్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పొందుపర్చిన విధంగా ఉద్యమకారులకు నెలకు రూ. 25 వేల పెన్షన్, 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాజేందర్, విజేందర్, సుమన్ రాథోడ్, రమేశ్, రాజు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం కోసం ఆర్థిక సాయం

రాయపర్తి, మార్చి 25: మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ కార్యకర్త అయిత కుమార్ కుమారుడు షారుణ్ తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ప్రతినిధి లేతాకుల రంగారెడ్డి బీఆర్‌ఎస్ మండల నాయకులు అయిత రాంచందర్, చందు రామ్‌యాదవ్, అయిత రాజు, రవి, పీరని రవీందర్, రాజులతో కలిసి ఎంజీఎంలో షారుణ్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా రూ. 6 వేల ఆర్థిక సాయం అందజేశారు.

పర్వతగిరి తైబజార్ ఖరారు

పర్వతగిరి మార్చి 25: పర్వతగిరి గ్రామ పంచాయతీ తైబజార్ వేలం ఖరారైనట్లు ఎంపీడీవో శంకర్‌నాయక్ మంగళవారం తెలిపారు. సింకేశి మహేందర్ రూ. 10.01 లక్షలకు తైబజార్ దక్కించుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీవో పాక శ్రీనివాస్, కార్యదర్శి రఘు, కారోబార్ కరుణాకర్ పాల్గొన్నారు.

ఫొటో స్టూడియోల బంద్ విజయవంతం

నెక్కొండ, మార్చి 25: ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ పిలుపుమేరకు నెక్కొండలో మంగళవారం నిర్వహించిన ఫొటో స్టూడియోల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు బి.వేణు మాట్లాడుతూ పెరిగిపోతున్న ముడిసరుకుల ధరలకు అనుగుణంగా ఫొటో చార్జీల పెంపు అనివార్యమైందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంబేద్కర్ నగర్ వాసుల సమస్యలు పరిష్కరించాలి

నర్సంపేట, మార్చి 25: వరంగల్ రోడ్డులోని అంబేద్కర్ నగర్ వాసుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రతినిధి కల్లెపెల్లి ప్రణయ్‌దీప్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మెస్పీ, డీబీఆర్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ నగర్‌లో 275 మంది నిరుపేదలు గుడిసెలు వేసుకొని నాలుగేళ్లుగా నివాసముంటున్నారని, కాలనీలో విద్యుత్, తాగునీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీక్షలో డీబీడ్పీఎస్ ప్రజా దండోరా జాతీయ అధ్యక్షుడు అందె రవి, మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు తడుగుల విజయ్, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్దూ, వీహెచ్ జిల్లా అధ్యక్షుడు బాబు రాజు, గవర్‌సింగ్, విజయ్, ప్రవీణ్, రాజు, యాకయ్య, సాంబలక్ష్మి, స్వరూప, రత్నం, సంజీవ్‌కుమార్, రమేశ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గిర్మాజీపేట, మార్చి 25: జిల్లాలోని వెను కబడిన తరగతుల కులాలకు చెందిన నిరు ద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థిక పురోగతి పెంపొదించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పుష్పలత ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు http://tgobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో వివరాలను ఏప్రిల్ 4వ తేదీలోగా నమోదు చేసుకోవాలని సూచించారు.

అనాథాశ్రమానికి కూలర్ అందజేత

కరీమాబాద్, మార్చి 25: వేసవి నేపథ్యంలో తిమ్మాపూర్ సమీపంలోని న్యూ లైఫ్ అనాథ ఆశ్రమంలోని చిన్నారుల కోసం మనం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఎయిర్ కూలర్ అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గోల్ల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ చిన్నారుల కోసం కూలర్‌ను అందజేశామన్నారు. ప్రతి ఒక్కరూ తమకు తోచిన సాయం చేయాలని కోరారు.